# ఉద్యమానికేదినాంది



"యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్రదేవతా" అని చెప్పుకుంటూ ఉంటాం. నేటి సమాజంలో స్త్రీ చాలా దయనీయ స్థితిలో ఉంది. మనలాంటి వాళ్ళందరూ నడుంకట్టి ముందుకి దూకి స్త్రీని అటువంటి శోచనీయమైన స్థితినించి తప్పించి స్త్రీ ఔన్నత్యం ఏమిటో అందరికీ ముఖ్యంగా పురుషులకి అర్థం అయ్యేలా చేయాలి. మేం ఆధునిక స్త్రీలం అంటూ అత్యాధునికంగా మేకప్ వేసుకుని తిరిగితే సరిపోదు. మన ఆధునికత మన మేకప్‌నించో మన వస్త్రధారణ నించోకాక మన చేతల ద్వారా కనపడాలి. రూపంకాదు. హృదయం ఆధునికంగా ఉండాలి. మనం అందరం కలిసి దీన్ని ఒక ఉద్యమం వలె సాగించాలి. మన మహిళా మండలికి అనుబంధంగా ఉన్న హోమ్ నుంచే మన స్త్రీ జనోద్ధరణ కార్యక్రమాలు ప్రారంభిద్దాం. మన హోమ్ లోని అసహాయ స్త్రీలందరికీ మనం ఈ రోజునించే ఉపాధికల్పనా కార్యక్రమాలు రూపొందించటం ప్రారంభించబోతున్నాం. మీ తల్లి ఆడది, మీ చెల్లి ఆడది, మీ భార్య ఆడది, మీ కూతురు ఆడది. ఆడది లేనిది సృష్టిలేదు. ఆడది అంటేనే ఆదిశక్తి. ఆడది తల్చుకుంటే చేయలేనిదేమీ లేదు అని మనం అందరం మరోసారి రుజువు చేసి చూపిద్దాం. ఆడదానికి ఉన్న మనోశక్తికి ఎంతబలం ఉందో నిరూపిద్దాం."

సుశీలాదేవి ఉపన్యాసం సముద్రపు కెరటాల్లా వేగంగా, హోరుగా వచ్చి బలంగా శ్రోతల మనస్సుని తాకింది. ఆవిడ ఆ మహిళా మండలికి అధ్యక్షురాలు. ఆవిడ హయాంలోనే ఆ మహిళా మండలికి ప్రభుత్వపు గ్రాంట్లు శాంక్షన్ అయ్యాయి. ఆ మండలికి అనుబంధంగా నిస్సహాయ స్థితిలో ఉన్న స్త్రీలకోసం ఒక హోమ్ తెరవబడింది. అందులోని ఇన్‌మేట్స్‌కి ఏదో ఒక వ్యాపకం కల్పించే కార్యక్రమంలో ప్రస్తుతం ఆవిడ చేపట్టిన కార్యం ఓ ప్రయత్నం. ఆ సందర్భంగానే ఆవిడ ప్రసంగించింది.

సుశీలాదేవి ఎన్ని ప్రజోపయోగమైన పనులు చేసినా, పెద్దల వద్ద తనకున్న పలుకుబడితో మహిళామండలికి ఎంత ప్రయోజనం చేకూర్చినా ఆవిడకీ ఆ మండలిలోనే ఒక వ్యతిరేకవర్గం ఉంది. ఆ వర్గానికి నాయకురాలు సరస్వతీబాయి.

ఆవిడకి అనుచరులు శ్రీమతి, దుర్గ, శమంత మొదలైన వారు. సరస్వతీబాయికి ఎలాగైనా సుశీలాదేవిని దింపి ఆ పదవిని తాను అందుకోవాలని ఉంది. కానీ పాపం ఆవిడ ఉబలాటం, ముచ్చట ప్రస్తుతానికి తీరేమార్గం ఏమీ కనపడటంలేదు. సుశీలాదేవికి ఆ మండలిలో ఉన్న ఫాలోయింగ్ ఏనాటికీ సరస్వతీబాయిని అధ్యక్షురాల్ని కానిచ్చేలా లేదు.

సరస్వతీబాయి పేరుకే సభలో కూర్చుంది కానీ, ఆవిడ పంచేంద్రియాలేవీ అక్కడ లేనేలేవు. సుశీలాదేవి తన ఉపన్యాసంలో ఏం చెప్పిందో కూడా వినిపించుకోలేదు ఆవిడ. సుశీలాదేవి మంచివక్త. తన ఉత్తేజకరమైన ఉపన్యాసంతో శ్రోతలను ఎలా ఆకట్టుకోవాలో బాగాతెలిసిన వ్యక్తి సుశీలాదేవి, ఉపన్యాసం ముగించినట్లుగా అయగా, ఇష్టంగా, బలంగా కొడ్తున్న చప్పట్లవల్ల గ్రహించి అనిష్టంగానే తానూ క్లాప్ చేయసాగింది సరస్వతీబాయి.

ఆ తరువాత ఆధ్వర్యంలో హోమ్‌లో స్త్రీలందరికీ కుట్టుమిషన్లపై రెడీమెడ్ బట్టలు తయారుచేసే పని, బట్టల అల్లికపని,



భట్టిప్రోలు విజయలక్ష్మి

కాయగూరలు, పువ్వులు, పండ్లు కాయించేపని, పువ్వుల మాలలు అల్లేపని, ఇంటీరియర్ డెకరేషన్ కోసం రకరకాల ఆర్టికల్స్, బొమ్మలు తయారుచేసేపని ఇలా అనేక పనులు అప్పచెప్పటం జరిగింది. ఏయే పనులు ఎవరికి అప్పచెప్పాలో వాళ్ళ వయస్సు, శక్తిని, ఉత్సాహాన్ని దృష్టిలోపెట్టుకొని అప్పజెప్పింది సుశీలాదేవి. అన్ని పనులూ సక్రమంగా నిర్వర్తించగలిగానూ అని ఖరారు చేసుకున్నాకే సుశీలాదేవి అందరికీ వీడ్కోలు చెప్పి కారెక్కింది.

అంతవరకూ ఆవిడ నిష్క్రమణం కోసమే ఎదురుచూస్తున్న సరస్వతీబాయి బృందం వెంటనే ఒక్కచోట చేరారు.

"పూరికే నాచుట్టూ చేరితే మాత్రం ఏం లాభం ఆ సుశీలని దించేమార్గం ఏదన్నా ఉంటే చెప్పండి చేద్దాం" అంది సరస్వతీబాయి.

"వేరే దింపటం ఎందుకండీ ఎలాగూ ఎలక్షన్లు వచ్చే వేళే. అప్పుడు మీరూ పోటీచేయండి" చెప్పింది శ్రీమతి.

"ఎందుకూ కిందటి సారిలాగా నా ఒక్కదాని ఓటూ నాకు పడటానికా? అది కాదు పద్ధతి. ఎన్నికల లోపల ఆవిడచేత ఏదయిన అన్‌పాపులర్ పని ఒకటి చేయించి అది బైట పడేయాలి అప్పుడే ఓట్లు చీలి నాకూ కొన్ని అయినా వస్తాయి".

"అబ్బే ఎన్ని అయినా అనండి. ఆవిడ ఎన్నికలలో నించోకపోతే తప్ప మన సరస్వతీ బాయిగారు ఎన్నికయ్యే అవకాశం లేదు. ఆవిడ ఎన్నికలలో నించోనని ప్రకటించాలి. అప్పుడే ఈవిడ గెలవగలుగుతారు." అంది తేల్చేసినట్లుగా దుర్గ.

"సుశీలాదేవిగారింట్లో పనిచేసే పనిమనిషి, మాయింట్లో పనిచేసే పనిమనిషి అక్కచెల్లెళ్ళు. రేపు ఆదివారం నాడు మా పనిమనిషితో చెప్పి సుశీలాదేవిగారి పనిమనిషిని మా ఇంటికి రప్పిస్తాను. యజమానుల లూప్‌హోల్స్ కొన్నయినా పనివాళ్ళకి తెలుస్తాయి. దాని ద్వారా ఆవిడ బలహీనతలేవో తెలుసుకోగలిగతే కొంతపని అయినట్లేననుకుంటా" సలహా చెప్పింది శమంత.

"ఇదీ అసలైనమాట. నీ ఆలోచన భేషుగ్గా ఉంది. నువ్వే కనుక సుశీల బలహీనతలేమిటో ఆ పిల్లద్వారా చెప్పిస్తివా నువ్వే ఈ సంవత్సరం మన మండలికి సెక్రటరీవి". అప్పుడే తనచేతిలో లేని పదవిని దానంచేసేసింది సరస్వతీబాయి.

"థాంక్స్ సరస్వతీబాయిగారూ" అంది సంతోషంగా శమంత.

"ట్రెజరర్ పోస్ట్ నాకిప్పిస్తానంటే నేనింకా మహత్తరమైన అయిడియా చెప్తాను" అంది శ్రీమతి.

"ఏమిటి?" అందరూ అప్రమత్తంగా అడిగారు.

"నా ఫ్రెండ్ సుకన్య, సుశీలాదేవిగారి చిన్నబ్బాయి చరణ్‌తో ప్రేమలో పడింది. ఇద్దరి కులాలూ, అంతస్థులూ పూర్తిగావేరు. ఈ పెళ్ళికి సుశీలాదేవిససేమీ ఒప్పుకోనందిట. మనంకాని ఈ విషయాన్ని వెలుగులోకి లాగామా. ఇక చూడండి ఆవిడ మనంచేసే అల్లరికి తలెత్తుకోలేదు. స్త్రీ జనోద్ధరణ గురించి సభల్లో, సమావేశాల్లో ప్రసంగించే సుశీలాదేవి తన కొడుకు దగ్గరికొచ్చేసరికి కులంకాని కోడలు పనికిరాదందీ అని ప్రచారం చెయ్యొచ్చు. కట్నం ఆశకూడా ఉంది. అందుకే తన స్థితి కన్నా తక్కువలో ఉన్న అమ్మాయిని తోసిపారేసిందీ అని అల్లరి చెయ్యొచ్చు. ఇదికాని మనం సక్రమంగా నిర్వర్తించామా ఆవిడ తలెత్తుకోలేక ఈసారి ఎలక్షన్‌లోనే నించోదు. అప్పుడు మన సరస్వతీబాయిగారే ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన మన భావి ప్రెసిడెంట్" చెప్పింది శ్రీమతి.

శ్రీమతి చూపిన రంగుల కలలో మునిగిపోయిన అందరికీ భవిష్యత్తులో తమకి రాబోయే పదవులు నోరూరించాయి.

"ఇంకేం ఇన్ని విశేషాలుంటే పదండి ఆ సుకన్యని కలుసుకోవడానికి బయల్దేరుదాం" అంటూ లేచింది దుర్గ.

"నన్నే కానీ ప్రెసిడెంట్‌ని చేశారా మీ రుణం ఉంచుకోనర్రా" అంటూ తన భారీ కాయాన్ని లేపుతూ లేచింది సరస్వతీబాయి.

అందరూ కలిసి సుకన్య ఇంటికి వెళ్ళారు. సుకన్యతల్లి శ్రీమతిని గుర్తించి ఆహ్వానించింది.

"సుకన్య బయటికి వెళ్ళిందమ్మా శ్రీమతీ. నువ్వూ మీ ఫ్రెండ్స్ ఇలా కూచోండి ఈలోపల వచ్చేస్తుంది. వెళ్ళి చాలాసేపయింది" చెప్పింది సుకన్యతల్లి.

ఎంతసేపు చూసినా సుకన్య రాలేదు. రాత్రి తొమ్మిది దాటుతుండగా ఇంటికి వచ్చింది. ఏడిచి ఏడిచి వచ్చినట్లు ఆమె ముఖం చూడగానే అందరికీ అర్థం అయింది. తెల్లబోయి ఒకరి మొఖాలొకరు చూసుకున్నారు.

వీళ్ళందరినీ చూస్తూనే, "క్షమించండి, నేను ప్రస్తుతం చాలా గొడవల్లో ఉన్నాను. నా సమస్యలే నాకు బోల్డున్నాయి. ఇలాంటి సమయంలో మీతో నేను మాట్లాడలేను. ఇంకోసారి కలుద్దాం" అంటూ లోపలికి వెళ్లిపోయింది.

అందరూ ఇంకా తెల్లబోయారు. లాభం లేదు. ఈ సుకన్య మూడ్‌లో లేదు. ఇంకోసారి ప్రయత్నించాల్సిందే అనుకొని బయటపడ్డారు.

దిగులుగా ఉన్న సరస్వతీబాయిని చూసి దుర్గ, "దిగులు పడకండీ, మనకి ఇంకో బాణం పనిమనిషి ఉందికదా. రేపు సరిగ్గా పన్నెండింటికి అందరం శమంత ఇంటికి చేరుకుందాం. ఆపైన అన్నీ శమంతే చూసుకుంటుంది" అంది.

"అవును. అంతగా అవసరం అయితే సుకన్యని ముందు నేను కలుసుకొని తరువాత అందర్నీ తీసుకొచ్చి మాట్లాడిస్తాను" అంది శ్రీమతి.

మరుసటిరోజు పిట్ట వీళ్ళ ఉచ్చులో పడనేపడింది, "నిన్న మాపటేల ఒక అమ్మాయి గారెవరో మా అమ్మగారికోసం వచ్చారు. ఇద్దరూ చాలాసేపు ఏమేమో మాట్లాడుకున్నారు. మధ్యలో నన్ను కాఫీ ఇచ్చేందుకు పిల్చినారమ్మా. నేను లోపలికి పోయేవేలకి ఆ అమ్మాయిగార్ని మా అమ్మగారు గట్టిగా తిడ్తున్నారు. ఆ పిల్లేమో ఏడుస్తోంది. మా అమ్మగారేమో అసలు నీలాంటి పిల్ల నాకు కోడలిగా పనికిరాదు పొమ్మంది. ఏ ధైర్యంతో నా కొడుక్కి మనసిచ్చావూ అంది. ఇంకా ఏటేటో చానా అంది అమ్మగారూ. ఆ పిల్ల పాపం ఏడుస్తూనే కాఫీ అయినా తాగకుండా వెళ్ళిపోయిందమ్మా." సరస్వతీబాయి ఇచ్చిన కొత్త యాభై రూపాయల నోటు చూసుకునే ఆనందంలో క్రితం రాత్రి తాను చూసినంత వరకూ, విన్నంత వరకూ చెప్పేసింది ఆ పనిమనిషి.

"చిక్కావురా మిడతంభొట్లూ" అనుకుంది ఆనందంగా సరస్వతీబాయి.

"సరే ఇంక నువ్వెళ్ళు" అని దాన్ని పంపించేసింది శమంత.

"ఇంక మన ప్లాన్ రెడీ. రేపు మన మహిళామండలి మీటింగ్‌లో సుకన్య విషయమే మొదట చర్చించేలా చేయాలి. సుకన్య రాకపోయినా సరే. కొడుకు ప్రేమించిన అమ్మాయిని కులమూ, అంతస్థూ పేరుతో కోడలుగా చేసుకోలేని సుశీలాదేవి మహిళా మండలి అధ్యక్షురాలిగా మహిళలకు ఏమి సేవ చేయగలదని మనం అందరం ఆవిడని నిలదీసి ప్రశ్నించాలి. ఆవిడ ఏం సమాధానం చెప్పుకుంటుందో చూద్దాం" అంది సరస్వతీబాయి.

అనుకున్నది అనుకున్న విధంగానే ఆచరణలో పెట్టారు సరస్వతీబాయి బృందం.

"సుకన్య విషయమా? ఆ పిల్ల మీకెలా తెలుసు" అడిగింది సుశీలాదేవి అందర్నీ చూస్తూ.

"తెలుసు. ఆ పిల్లకేం తక్కువని మీరు మీ కోడలిగా ఆ పిల్లని పనికి రాదన్నారు? ఇన్నాళ్ళూ మాకందరికీ శ్రీరంగనీతులు చెప్పి మీరు చేసే పనేమిటి? సాటి ఆడదన్న కనికరమైనా లేదా మీకూ?" అడిగింది శమంత.

"మీరు దీనికి సమాధానం చెప్పేవరకూ మిమ్మల్ని ఇక్కడినించి కదలనియ్యమనే విషయం మర్చిపోకండి" అంది దుర్గ.


"సుకన్యకి న్యాయం జరిగేవరకూ మేమంతా ఆవిడకోసం పోరాడతాం" అంది శ్రీమతి.

"మీరు చెప్పేదేమిటో నాకేమీ అర్థంకావటంలేదు. నేనేమిటి? సుకన్యకి అన్యాయం చేయటమేమిటి? అసలు సుకన్య ప్రస్తుతం ఇక్కడే నా గదిలో ఉంది. పిలిపిస్తాను మీరే మాట్లాడండి" అంది సుశీలాదేవి అర్థంకానట్లు చూస్తూ.

"పిలిపించండి. మీరు ఆ పిల్లకి చేసిన అన్యాయమేమిటో ఆ పిల్లనోటితోనే చెప్పిస్తాం. బహుశా అప్పుడు మీరు మీ తప్పు ఒప్పుకోక తప్పదనుకుంటాను" అంది గంభీరంగా సరస్వతీబాయి.

"సుకన్యా ఒకసారి ఇలా రామ్మా. నేనేదో నీకు అన్యాయం చేశానని వీళ్ళంతా నామీదకి దాడికి వచ్చారు. వీళ్ళ అనుమానాలేవో తీర్చిపంపు" అంటూ సుకన్యని పిలిచింది సుశీల.

సుకన్య బయటికి వచ్చింది. ఆమె ముఖం ఇంకా దిగులుగానే ఉంది. తెల్లవార్లూ నిద్రపోలేదని ఆమె కళ్ళు అందరికీ చెప్పాయి. సరస్వతీబాయి బృందం చేసిన ఆరోపణ విన్న తర్వాత సుకన్యని చూస్తే వారు చెప్పిందంతా నిజమే అనుకున్నారు మిగిలిన



మెంబర్లు.

"ఏం చెప్పమంటారు ఆంటీ?" అడిగింది సుకన్య.

"అదేనమ్మా మా శ్రీచరణ్‌తో నీ పెళ్ళికి నేను అడ్డుపడ్డానంటున్నారు వీళ్ళంతా నిజమేమిటో నువ్వే చెప్పు" అంది సుశీలాదేవి.

"చెప్పు సుకన్యా ధైర్యంగా చెప్పు. మేమందరం నీకు అండగా ఉంటాం. నువ్వూ శ్రీచరణ్ ప్రేమించుకున్నారా లేదా?" అడిగింది శ్రీమతి.

"అవును"

"పెళ్ళి చేసుకోవాలనుకున్నారా లేదా?"

"అవునూ"

"ఈవిడ మొన్నరాత్రి నిన్ను తిట్టి నువ్వు నా కోడలిగా పనికిరావందా లేదా?"

"అవునూ"

"చూశారా సుశీలాదేవిగారూ మీరు ఇంక మా ప్రెసిడెంట్‌గా ఉండే అర్హత పోగొట్టుకున్నారు. ఆడవాళ్ళంటే ఆదిశక్తులని ఉపన్యాసాలలో ఎత్తేసేమీరు నిజజీవితంలో ఇలా ప్రవర్తిస్తారని తెలియక మిమ్మల్ని ఇన్నేళ్ళుగా మా ప్రెసిడెంట్‌గా ఎన్నుకుంటూ వచ్చాం. మీరు రాజీనామా చేయాలి" అంది దుర్గ.

వెంటనే అందరూ "అవును సుశీలాదేవి గారు రాజీనామా చేయాలి" అంటూ అరిచారు.


"శ్రీచరణ్‌తో నా పెళ్ళి ఆగిపోవటానికీ, ఆంటీ రాజీనామా చేయటానికీ ఏమిటి సంబంధం" అడిగింది సుకన్య.

"నీకింత అన్యాయం చేసినా ఇంకా ఆవిడవైపే మాట్లాడుతున్నావా సుకన్యా?" అడిగింది శ్రీమతి.

"శ్రీమతి! నువ్వు అనవసరంగా అపోహ పడ్తున్నావే, మా పెళ్ళి ఆగిపోవడానికి కారణం ఆవిడకాదు. నాకులం, అంతస్థూ అంతకన్నాకావు. ఆ కారణాలు వేరు శ్రీమతీ."

"అయితే అవేమిటో చెప్పు. అప్పటిదాకా మేము ఆవిడని, ఆవిడ నిజాయితీని నమ్మలేం" అంది శమంత.

సరస్వతీబాయి తామగా ఏం కల్పించుకోకుండా రంగం వెనక మంచి నాటకం నడిపించసాగింది.




"సరే. మీకందరికీ అంతముచ్చటగా ఉంటే అలాగే చెప్తాను. అయినా నా ఆపద మీరు అర్చనూలేరు, తీర్చనూలేరు. అయినా సరే నా మంచి ఆంటీకి అపవాదు రాకూడదు. అందుకే చెప్తున్నాను వినండి. నేనూ, ఆంటీ చిన్నకొడుకు శ్రీచరణ్ ఇద్దరం ప్రేమించుకున్నాం. పెళ్ళి చేసుకోవాలనుకున్నాం. కానీ శ్రీచరణ్ ఆంటీ కన్నకొడుకు కాదు. చిన్నప్పుడు శ్రీచరణ్ ఎవరోకని ఆంటీ వాళ్ళింటి ముందర చెత్తకుండీలో పడేస్తే ఆంటీ ఆ పిల్లాడ్ని లోకభీతికి బెదరక కొడుకులాగా పెంచి పెద్దచేశారు. ఈ విషయం కొద్దిమంది పెద్దవాళ్ళకు మాత్రమే తెల్సు. నా దురదృష్టం కొద్దీ ఆ కొద్ది మందిలో మా అమ్మా నాన్నా కూడా ఉన్నారు. కులం, గోత్రం కనీసం తల్లిదండ్రుల పేరైనా తెలియని శ్రీచరణ్ ఇంటి అల్లుడు కావడానికి మా అమ్మా నాన్నా ఒప్పుకోలేదు. వాళ్ళని కాదని సాహసంగా బైటకొచ్చి శ్రీచరణ్‌ని పెళ్ళాడలేని అసమర్థత నాది. ఈ సమస్యకి ఆంటీయే పరిష్కారం చూపించగలదని మొన్న నేను ఆంటీని కలుసుకోవాలని వెళ్ళాను. నా పిరికి తనాన్ని ఆవిడ తిట్టారు. ధైర్యంగా బైటకొచ్చేస్తే పెళ్ళి జరిపించే పూచీ తనదన్నారు. అసలు నాలాంటి పిరికిది తనకు కోడలుగా పనికిరాదు పొమ్మన్నారు. సొంతంగా నిర్ణయాలు చేసుకోలేని వాళ్ళకు ప్రేమెందుకు నోరుమూసుకోమన్నారు. పోయి పెద్దలు కుదిర్చిన పెళ్ళి చేసుకోమన్నారు. నన్ను తిట్టే, హేళనచేసే నాలో పౌరుషాన్ని లేపాలని చూశారు. ఎవరో కనిపడేసిన పసిగుడ్డుని, ప్రాణంతప్ప ఏమీలేని అనాథ శిశువును అంటీలాంటి మహనీయులు పెంచి పెద్దచేసి విద్యాబుద్ధులు చెప్పించి ఇంతవాడ్ని చేస్తే, ఈనాడు సంఘంలో పేరూ, ఆస్తీ అంతస్థూ, చదువూ, ఉద్యోగమూ, పరువూ, మర్యాదా అన్నీవున్న శ్రీచరణ్‌ని అతని పుట్టుక కారణంగా అల్లుడుగా చేసుకోవడానికి మా అమ్మా నాన్నా సిద్ధంగా లేరు. ఆడవాళ్ళలో అబలత్వమంటే ఆంటీకి కోపం అందుకే ఏడుస్తూ కూర్చున్న నన్ను తిట్టి ఇంట్లోంచి తరిమేసింది" చెప్పింది సుకన్య.

'ఇతంతా నిజమా?' అన్నట్లు సరస్వతీ బాయి బృందం నిలువుగుడ్లు వేశారు. తలలు ఎక్కడ పెట్టుకోవాలో కాసేపు తెలియలేదు వాళ్ళకి.

"ఇప్పుడు రంగం మారిందిలెండి. తల్లీతండ్రిని వదిలి సుకన్య నా దగ్గరికి వచ్చేసింది. రేపు ఉదయం గుళ్ళో పెళ్ళి. సాయంత్రం పెళ్ళి రిజిస్ట్రేషన్. అది అయినాక రేపు రాత్రి ఏడింటికి మా ఇంట్లో మీకందరికీ పార్టీ ఉంది. మీరంతా తప్పక వచ్చి వధూవరులను ఆశీర్వదించాలి. ఉత్సాహమున్నవారు రిజిస్ట్రార్ ఆఫీసులో సాక్షి సంతకాలు పెట్టడానికి రావచ్చు" చెప్పింది సుశీలాదేవి.

సుకన్య సిగ్గుగా తలవంచుకుంది

ఈ సంవత్సరమూ లాభంలేదు. అయినా పని మనిషి మాటలు విని పంచాయితీ పెట్టబోయిన తనదే తప్పు అనుకుంటూ సుకన్యకి శుభాకాంక్షలు చెప్పింది ఏడుపు మొఖంతో సరస్వతీబాయి.